క్లుప్తంగా

కన్నుల పండువగా కల్యాణ మహోత్సవం



తెనాలిటౌన్: లోక కల్యాణార్థం ప్రతి ఏటా జూన్ 9వ తేదీన శ్రీ పరంజ్యోతి భగవతి భగవాన్ కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు. రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సర్వదేవా పరంజ్యోతి మానవ సేవాలయంలో సోమవారం భగవతి భగవాన్ కల్యాణ మహోత్సవం వేడుకగా నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి వందలాది భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని భగవతి భగవాన్‌ల ఆశీర్వచనలు అందుకున్నారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా వైదికులు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం 108 నైవేద్యాలతో మహాప్రసాదం నివేదన గావించారు. తదుపరి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ విద్యార్థినికి ప్రతిభా అవార్డు



తెనాలిటౌన్: స్థానిక నాజర్‌పేటలోని సెయింట్‌పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థి డి.హేమిమాకు షైనింగ్ స్టార్స్ ఇన్ ఇంటర్మీడియట్ 2025 ప్రతిభ అవార్డు లభించింది. గుంటూరులోని బి.కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ చేతుల మీదుగా హేమామి ప్రతిభ అవార్డు అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఏ.లింకన్ బాబు మాట్లాడుతూ ప్రతిభా అవార్డులతో పాటు రూ.20 వేలు నగదు, మెడల్‌ను విద్యార్థినికి బహుకరించినట్లు తెలిపారు. విద్యార్థినికి ప్రతిభ అవార్డు రావడం పట్ల కళాశాల కరస్పాండెంట్ ఆర్.షీలా సుజని, అధ్యాపకులు డాక్టర్ స్వేచ్ఛ, కీర్తి అబ్రహాం, ఉషా, సురేష్‌లు అభినందనలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యాచకుడు మృతి




తెనాలిరూరల్: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే రోడ్డులో ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లే మార్గం వద్ద సుమారు 60 ఏళ్ల వ్యక్తి మెడకు టవల్ చుట్టి ఇనుప గొట్టానికి కట్టి మృతి చెంది ఉన్నాడు. ఎవరైనా హత్య చేశారా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న విషయంలో స్పష్టత లేదు. త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు యాచకుడని ప్రాథమికంగా తెలుస్తోందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరిముల్లా తెలిపారు.

పలువురు మున్సిపల్ ఉద్యోగులు బదిలీ

తెనాలిఅర్బన్: సాధారణ బదిలీల్లో భాగంగా తెనాలి పురపాలక సంఘం పరిధిలో పనిచేసే పలువురు ఉద్యోగులు బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్ళనున్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నజీర్ బాపట్లకు, బాపట్లలో పనిచేస్తున్న దావులూరి శ్రీనివాసరావు తెనాలికి రానున్నారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ తులసీ పొన్నూరు, పొన్నూరులో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ తెనాలికి, తెనాలిలో పనిచేస్తున్న శిరీష నరసరావుపేట, నరసరావుపేటలో పనిచేస్తున్న పి.లక్ష్మణ్ తెనాలికి రానున్నారు. వీరు రెండు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో జాయిన్ అయ్యే అవకాశం ఉంది.

సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు



రేపల్లె: సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు అందినట్లు ఆర్డీఓ నేలపు రామలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. తమ తల్లిదండ్రుల కార్డు నుంచి తొలగించి నూతన కార్డు మంజూరు చేయాలని ఒక అర్జీ, ఎన్టీఆర్ భరోసా పింఛన్ మంజూరు చేయాలని ఒక అర్జీ, పీఎం విశ్వకర్మ యోజన పథకంలో శిక్షణ పూర్తి చేసుకున్న తనకు కార్పెంటర్ పనికి సంబంధించిన పనిముట్లు అందించాలని అర్జీ, తన పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని రెండు అర్జీలు, పారిశుధ్య కార్మికుడు వేణు పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఒక అర్జీ వచ్చిందన్నారు.

పరిహారం రాకుంటే ఆందోళన తథ్యం

- అగ్నిబాధిత పసుపు రైతుల కమిటీ కన్వీనర్ జొన్నా శివశంకరరావు
- సబ్‌కలెక్టర్‌తో పసుపు పంట బీమాపై వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన రైతులు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీ అగ్నిప్రమాద బాధితులు నష్టపోయిన పసుపునకు క్వింటాలుకు రూ.7,000 చొప్పున పరిహారం వచ్చేలా చూడాలని లేకుంటే ఆందోళన తథ్యమని అగ్నిబాధిత పసుపు రైతుల కమిటీ కన్వీనర్ జొన్నా శివశంకరరావు స్పష్టం చేశారు. కమిటీ ఆధ్వర్యంలో బాధిత పసుపు రైతులు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహాను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను విన్నవించారు. రెండు మూడేళ్లుగా సాగుచేసి పండించిన పంట మొత్తం ప్రమాదంలో కాలిపోయిందని గుర్తు చేశారు. అప్పుడు చేసిన అప్పులు తీర్చటానికే వీలుకావటం లేదని, మళ్లీ వ్యవసాయం చేయటానికి పెట్టుబడులు లేవని చెప్పారు. బాకీలు తీర్చమంటూ రోజూ ఇంటికి వస్తున్న అప్పుల వాళ్లతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరగా పరిహారం ఇప్పించి తమకు పరిష్కారం చూపాలని కోరారు. సబ్‌కలెక్టర్ సంజనా సింహా మాట్లాడుతూ అధికారుల నుంచి అన్ని పత్రాలు, సంబంధిత బీమా కంపెనీకి ముంబయిలో గల ప్రధాన కార్యాలయానికి వెళ్లాయని చెప్పారు. అక్కడ ప్రాసెసింగ్‌కు కనీసం పదిరోజుల సమయం తీసుకుంటుందని చెప్పారని, ఆవిధంగా మరో మూడురోజుల సమయం పడుతుందని భావిస్తున్నానని చెప్పారు. అయినా మరోసారి విచారిస్తానని హామీనిచ్చారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో కోల్డ్‌స్టోరేజి తగులబడిన ఘటనలో నష్టపోయిన మిర్చి పంటకు 1120 మంది రైతులకు డబ్బులు వచ్చేశాయనీ, తమకు మాత్రం ఎందుకు న్యాయం జరగటం లేదని రైతులు ప్రశ్నించారు. ఏదేమైనా సబ్‌కలెక్టర్ మాటపై మరో వారంరోజులు వేచిచూస్తామన్నారు. అప్పటికీ సానుకూలం కాకుంటే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతవరకు రాకుండానే పని జరుగుతుందని భావిస్తున్నట్టు సబ్‌కలెక్టర్ అన్నారు. ఒక సందర్భంలో 'మీరు నా దగ్గరకు ఎన్నిసార్లు వచ్చారో...అంతకన్నా ఎక్కువసార్లు ఫాలోఅప్ చేశాను' అని ఆమె వివరించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలకు ముందే డబ్బులు ఇప్పిస్తామని మంత్రి రైతులకు చెప్పారని, ఇంతవరకు ఆచరణలో జరగలేదన్నారు. వ్యవసాయం చేసేందుకు, కుటుంబ ఖర్చులకు డబ్బులు లేక, అప్పు పుట్టక రైతులు ఆందోళన పడుతున్నారని, అలాంటివారు ఏదైనా తీవ్ర నిర్ణయం తీసుకోకముందే ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల చంద్రశేఖర్, ఆళ్ల వెంకటప్పారెడ్డి, ఆళ్ల గోవింద రెడ్డి, దేవతి సత్యనారాయణ, తుంగల వీరరాఘవులు, కొమారెడ్డి రంగారెడ్డి, బొల్లిముంత రామారావు, పాన కాలరెడ్డి, భీమవరపు చినరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శభాష్... విష్ణుప్రియ కావేరి



కలెక్టర్ చేతుల మీదగా ప్రతిభ పురస్కారాన్ని అందుకుంటున్న విష్ణు ప్రియ కావేరి


కొల్లిపర: ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను సత్కరించే కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గుంటూరులో నిర్వహించిన ఆ కార్యక్రమంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గరిక విష్ణుప్రియ కావేరి 2024 -25 విద్యా సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు గాను 578 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభ (షైనింగ్ స్టార్) అవార్డుకు ఎంపికైంది. విద్య ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని, కులం, మతం అనేది అడ్డు కాదని ఈ ఏకలవ్య విద్యార్థిని నిరూపించింది. అంతేకాకుండా ఎనిమిదవ తరగతిలో ఎన్ ఎం ఎం ఎస్ పరీక్షకు ఎంతో కష్టపడి చదివి, పట్టుదలతో ఉత్తీర్ణత సాధించి నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం అందించే ఆర్థిక సహకారానికి ఎంపికైంది. సోమవారం గుంటూరులోని పొన్నూరు రోడ్ లో బీ కన్వెన్షన్ హాలులో జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి రేణుక ఏర్పాటు చేసిన ప్రతిభ (షైనింగ్ స్టార్స్) అవార్డుల ప్రదానోత్సవ సభలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, గుంటూరు తూర్పు శాసనసభ్యులు మహమ్మద్ నజీర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఆర్జెడి పద్మ చేతుల మీదుగా 20 వేల రూపాయల చెక్కు, మెడల్, సర్టిఫికెట్లు గరిక విష్ణుప్రియ కావేరి అందుకుంది. చదువుకు కులమతాలు అడ్డుకావని ఈ ఏకలవ్య విద్యార్థిని నిరూపించడమే కాకుండా కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులకు సైతం ఖ్యాతిని పెంచిందని పాఠశాల కొనియాడుతూ ప్రధానోపాధ్యాయులు ఎం.సౌజన్య, మాజీ ప్రధానోపాధ్యాయులు బిట్ర వెంకటరావు, ఉపాధ్యాయులు నందివెలుగు ఫణి గణితం ఉపాధ్యాయులు, ఈద సాంబిరెడ్డి, వర నాగలక్ష్మి, అనంతలక్ష్మి, భూపతి నాయుడు, శ్రీకాంత్ నాయక్, నాగలక్ష్మి తదితరులు విష్ణు ప్రియ కావేరిని అభినందించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: యోగాతో మానసిక ఒత్తిడిన అధిగమించవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో రజకపార్కు నుంచి సోమవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా చేయడం వలన మానసిక ప్రశాంతతా లభిస్తుందన్నారు. యోగాను ప్రతిరోజు చేయడాన్ని అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తహసీల్దార్ గోపాలకృష్ణలు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణంలో ప్రతిరోజు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 21న వేడుకలను తెనాలిలో కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రజకపార్కు నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు మీదుగా సత్యనారాయణ టాకీస్ రోడ్డు వరకు చేరుకుంది. ప్రతి సెంటర్‌లో యోగా ఆవశ్యకతను యోగా గురువులు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, మేనేజర్ విల్సన్ జయకర్, డీఈ శ్రీనివాసులు, పలువురు ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో సాహిత్య బాటసారి శారద పుస్తకావిష్కరణ



సాహిత్య బాటసారి- శారద పుస్తకం

తెనాలిఅర్బన్: అభ్యుదయ రచయితల సంఘం, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన సాహిత్య బాటసారి- శారద స్మృతి శకలాలు పుస్తకాన్ని తెనాలిలో ఆవిష్కరించనున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావులు తెలిపారు. బుధవారం ఉదయం 10.30గంటలకు ఏఎస్ఎన్ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు.

అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కర గ్రహీత పాపినేని శివశంకర్ ముఖ్యఅతిథిగా, మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ విశిష్ట అతిథిగా పాల్గొంటారన్నారు. 1985లో అలూరి భుజంగరావు రచించిన పుస్తకాన్ని తెనాలి ఇంప్రెషన్స్ వారు పునఃముద్రణ చేసినట్లు పేర్కొన్నారు. నటరాజన్ శారద మద్రాస్ నుంచి తెనాలి వచ్చి హోటల్ కార్మికునిగా పనిచేస్తూ తెలుగు నేర్చుకుని ప్రసిద్ధ రచయితగా ఎదిగారని గుర్తు చేశారు.

నటరాజన్ శారద జీవిత విశేషాలు

తెలుగు సాహితీ ప్రపంచంలో శారదనే కలం పేరుతో సుప్రసిద్ధులైన రచయిత నటరాజన్ శారద ఆయన అసలు ఎస్.నటరాజన్ 1924లో తమిళనాడులోని పుదుక్కోటలో సుబ్రహ్మణ్య అయ్యర్, భాగీరథి దంపతులకు జన్మించారు. 2వ ఏటనే తల్లిని కోల్పోవడంతో తన సోదరిల వివాహాల కారణంగా తండ్రితో కలిసి ఆయన 1937లో తెనాలి వచ్చారు. చిన్న వయస్సులోనే ప్రాచీన ఆధునిక తమిళ సాహిత్యాన్ని ఆకళింపు చేసుకున్నారు. తురగా వెంకటేశ్వరరావు అనే ఉపాధ్యాయుని వద్ద తెలుగు ఓనమాలు నేర్చుకుని, 1948 నుంచి 1950 వరకు రచనలు చేశారు. ప్రపంచానికి జబ్బు చేసింది అనేది తొలి వ్యంగ రచయిన, ప్రజావాణి, చంద్రిక అనే పత్రికలను ప్రారంభించి సంపాదకునిగా వ్యవహించారు. ఏది సత్యం, మంచి చెడు, అపస్వరాలు, చీకటి తెరలు, మహీపతి, అందాల దీవి, చదరంగం, సందేశం, నాగరీకుని ప్రేమ, కార్యదర్శి, హోటల్లో శవం వంటి ప్రసిద్ధి కథలు రచించారు. పేద మధ్యతరగతి ప్రజల జీవితాలు, వాటి కష్టాలు, మానసిక సంఘర్షణలు ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయి. నటరాజన్ శారద 1955 ఆగస్టు 17న మూర్ఛ వ్యాధితో మరణించారు.

ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న ధర్నా సోమవారంతో 188వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం ధర్నా నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో స్పందన కనిపించడం లేదని అన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఎం.ఆశీర్వాదం, సాంబయ్య, నాగేశ్వరరావు, దుర్గాభవాని, ఇమాంబి, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో మొక్కలు నాటే కార్యక్రమం

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం బైపాస్ రోడ్ సమీపాన ఉన్న శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం కాశీనాయన ఆశ్రమంలో సోమవారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. మంగళగిరి పార్టీ అసెంబ్లీ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనకు గుర్తుగా మొక్కలు నాటామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తుల్లిమిల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులు గట్ల శివకొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లూరు శివరామకృష్ణ, యువ మోర్చా అధ్యక్షులు బత్తుల ఆంజనేయులు, మంగళగిరి పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు కాండ్రు భాను కిషోర్, కొతరపు ధనుంజయ, కార్యకర్తలు బిక్షపతి, సుబ్బారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

తాడేపల్లి రూరల్: శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి గౌతమబుద్ధా రోడ్‌లో గల సంఘం కార్యాలయం వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు పందేటి సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రతి సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి ప్రోత్సహిస్తున్న దాతలు, సంఘ సభ్యులకు, ట్రస్ట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, గండికోట వీరరాఘవులు, అచ్చియ్య, పంచల శివన్నారాయణ, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, నాగరాజు, మధుబాబు, రెడ్డి వీర రాఘవులు, నంద్యాల గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన రహదారులు నిర్మించండి



కమిషనర్ శేషన్నకు అర్జీ అందజేస్తున్న వృద్ధుడు

తెనాలిఅర్బన్: 12,38 వార్డుల్లో నూతన రోడ్లు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 19వ వార్డులో చెట్లు కొట్టి వేయాలని, 33వ వార్డులోని కాల్వల్లో పూడిక తీత పనులు చేయాలని, 6వ వార్డులో గార్బేజ్ పాయింట్‌ను తొలగించాలని పలువురు అర్జీలు ఇచ్చారు. వీటన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి

ఫిరంగిపురం: గర్భిణులకు రక్తహీనత లేకుండా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండల కేంద్రంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఎత్తు, బరువు, పలురకాల రక్త, మూత్రపరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

తాడికొండ: కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందించే పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకుని విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకుని అదనపు ఖర్చులు లేకుండా చూసుకోవాలని ఏపీ సీఆర్‌డీపీ సర్కిల్ పర్యవేక్ష ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం తాడికొండ విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద ప్రభుత్వం ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.78 వేలు రాయితీ ఇస్తుందన్నారు. ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని విద్యుత్ అదనపు భారం తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందజేయాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం మంగళగిరి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దినేష్ రాఘవేంద్రరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, రైతు సంఘం నాయకులు జవ్వాది సాంబశివరావు, ఆళ్ల రామిరెడ్డి, నాసరయ్య, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు




వివరాలు వెల్లడిస్తున్న ఏపీ సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్ష ఇంజనీర్ సుబ్రహ్మణ్యం

తాడికొండ: తాడికొండ మండల పరిధిలో సోమవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 40 బృందాలుగా అధికారులు, సిబ్బంది కలిసి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 27 కేసులు అధిక లోడు, 4 కేసులు విద్యుత్ చౌర్యం, 5 కేసులు కేటగిరి-1 నుంచి 2కి వినియోగించిన కేసులు గుర్తించి రూ. 2.60 లక్షల అపరాధ రుసుము విధించినట్లు సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్ష ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. తాడికొండ విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యం చట్ట రిత్యా నేరమని.. అధిక లోడు వినియోగిస్తున్న వారు వెంటనే కేటగిరి-2 కిందకు మార్చుకుని సంబంధిత ఛార్జీలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, అమరావతి ఆపరేషన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జె.సంజీవరావు, మంగళగిరి డెప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ జి.సురేష్‌బాబు, తాడికొండ ఆపరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.నాగమల్లేశ్వరరావు, పలువురు విద్యుత్ శాఖ అధికారులు, ఏఈలు, డీఈలు పాల్గొన్నారు.

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ శాఖ విజిలెన్స్, సీఆర్‌డీఏ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తాడికొండ సెక్షన్ పరిధిలోని మోతడిక, మెక్కామల, పొన్నెకల్లు, పెద కండ్రిక, పాములపాడు, ఫణిదం, రావెలలలో సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 45 మంది అధికారులు, 195 మంది సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి 3,106 సర్వీసులను తనిఖీలు చేశారు. అదనంగా విద్యుత్ వాడుతున్న 27 మందికి రూ.1.26 లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురికి రూ.90 వేలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 5 మందికి రూ.1.40 లక్షలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన ఒకరికి రూ.5 వేలు మొత్తం కలిపి రూ.3.61 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తనిఖీల్లో సీఆర్‌డీఏ సర్కిల్ ఆపరేషన్ పర్యవేక్షక ఇంజనీర్ పి.సుబ్రమణ్యం, అధికారులు జె.సంజీవరావు, మల్లిఖార్జున ప్రసాద్, కోటేశ్వరరావు, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో డాక్టర్ గణేష్ జట్టు విజయం



ట్రోఫీతో రామకృష్ణారెడ్డి, టీం సభ్యులు

రేపల్లె: జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ టీమ్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. గత 10 రోజుల నుంచి దూళిపూడిలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. టోర్నమెంట్‌లో పాల్గొన్న చెరుకుపల్లి మండలం రాజోలుకు చెందిన రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని డాక్టర్ ఈవూరు గణేష్ టీమ్ ప్రతిభ చాటి విన్నర్‌గా నిలిచింది. ఇటీవల కృష్ణాజిల్లా ఘంటసాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో, కొల్లూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో రామకృష్ణారెడ్డి టీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది.

జగనన్న కాలనీలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

రేపల్లె: పట్టణంలోని జగనన్న కాలనీలో 1000 కుటుంబాలు నివసిస్తున్నప్పటికీ, స్థానికంగా రేషన్ షాపు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్థానికంగా రేషన్ షాపు ఏర్పాటు చేయాలంటూ నినాదాలు చేస్తూ, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ కాలనీలో నివాసం ఉంటున్న వారు పాత నివాస ప్రాంతాల పరిధిలో ఉన్న రేషన్ షాపులకే వెళ్లి రేషన్ తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీయూ వాహనాలు రద్దు చేయడం వల్ల కాలనీ నుంచి వారి పరిధిలోని రేషన్ దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటూ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కాలనీ నివాసితుల వివరాలు సేకరించి జగనన్న కాలనీలోనే దుకాణం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. అప్పటివరకు తాత్కాలికంగా దుకాణం ఏర్పాటు చేసి ప్రతినెల సరుకులు సక్రమంగా అందించాలన్నారు. కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి.ధనమ్మ, సహాయ కార్యదర్శి కె.నాంచారమ్మ, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కె.వీ రాంజనేయులు, సుధా దేవి, గౌసే తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారిగా బాధ్యతలు స్వీకరణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖాగ్రంథాలయాధికారిగా ఇ.వెంకటదుర్గారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన సత్యశిరీష బదిలీపై గుంటూరులోని పట్టాభిపురం బ్రాంచికి వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటదుర్గారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పుస్తకాలు రీడర్స్‌కు అందుబాటులో ఉండేలా చూస్తానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పి.జేమ్స్, డి.కృష్ణమూర్తి, సైదాసాహెబ్‌లు అభినందనలు తెలిపారు.

మునిసిపల్ కమిషనర్ బదిలీ

తెనాలి అర్బన్: పట్టణ మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న బదిలీ అయ్యారు. ఈ మేరకు మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ సోమవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. ఆయనను నంద్యాల మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. గుంటూరు కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న సి.ఓబులేసును తెనాలి మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు.